క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ కళాశాల ఆవరణలో ఉన్న ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జేహెచ్ హర్షవర్ధన్ తెలిపారు. పదో తరగతి పాసై ఆపై అర్హతలు కగిలిన అభ్యర్థులు జూన్ 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలు కాని వారు నేరుగా సంప్రదిస్తే కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

1వ తరగతి ప్రవేశాలకు 15 ఆఖరు తేదీ

సింగరాయకొండ: ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, హెచ్ఐవీ పాజిటివ్ తల్లిదండ్రుల పిల్లలు 1వ తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా చేరటానికి రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 15వ తేదీతో ముగుస్తుందని ఎంఈఓ బి. శివన్నారాయణ తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకుని గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద గానీ, ఎంఈఓ కార్యాలయంలో గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

25 శాతం సీట్లు కేటాయింపు

కొండపి: ప్రయివేటు విద్యాసంస్థల్లో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం 25 శాతం సీట్లు కేటాయించిందని ఒకటో తరగతి ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని ఎంఈఓ కె. సురేఖ శనివారం తెలిపారు. మండలంలోని పేద విద్యార్థులకు ప్రయివేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశం కల్పించాలన్న లక్ష్యంతో విద్యా హక్కు చట్టంలో సెక్షన్12 (1)సీ కింద ప్రవేశాలను సులభతరం చేసిందన్నారు. ఆన్ లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే కోరుకున్న పాఠశాలలో, లేదా ప్రభుత్వ ఎంపిక చేసిన పాఠశాలల్లో సీటు పొందవచ్చన్నారు. మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

డీఎస్పీని కలిసిన మున్సిపల్ చైర్మన్



డీఎస్పీని సన్మానిస్తున్న చైర్మన్ గఫార్, బీసీ సంఘాల నాయకులు

కనిగిరి రూరల్: డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రత్నాకర రామరాజును శనివారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీని సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఎస్‌కే నాయబ్ రసూల్, ఈర్ల విజయరామరాజు, పల్లా మాలకొండలరావు, కోశాధికారి పట్నం నర్సింహులు, నాయకులు కేతన బోయిన పెద్దన్న, డి.చెంచులు, చింతలపూడి వెంకటేశ్వర్లు, కె.ఓబులేసు, చెరుకూరి చిన కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

టంగుటూరు: మండల కేంద్రం పరిధిలో ఇద్దరు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఫిర్యాదుదారులకు ఎస్సై ఖాదర్ బాషా స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ టంగుటూరు ఏఈఓ కార్యాలయ సిబ్బంది సరస్వతి, టంగుటూరు గ్రామానికి చెందిన షేక్ బాషా ఇద్దరు సెల్‌ఫోను పోగొట్టుకునట్లు ఫిర్యాదు ఇవ్వగా టెక్నికల్, ఐటీ కోర్ టీమ్ సాంకేతికతను ఉపయోగించి, పోగొట్టుకున్న సెల్‌ఫోను గుర్తించి బాధితులకు అందించారు. ఇప్పటి వరకు టంగుటూరు పోలీసు స్టేషన్లో 107 మందికి సెల్‌ఫోన్లు గుర్తించి అందించామన్నారు. సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

పాలనలో దేశానికే ఆదర్శం

- పార్టీలకు అతీతంగా పథకాలు
- కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



సంక్షేమ క్యాలండర్‌ను అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

మర్రిపూడి: ప్రజా సంక్షేమాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. శనివారం మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. అర్హత కలిగి ఉండి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఏ పథకమైనా అందించాలని సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. అప్పుడే వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పింఛన్‌లు మంజూరు చేయాలని, పొలం వెళ్లే రహదారులు, సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలని, జగనన్న గృహాలు మంజూరు చేయాలని వరికూటి అశోక్‌బాబును కోరారు. గ్రామంలో ఎస్సీ, బీలకు జగనన్న లేఅవుట్లలో 76 కాలనీలు మంజూరయ్యాయని, అయితే ఆ కాలనీల పై నుంచి 220 కేవీ విద్యుత్ లైన్ పోతోందని.. మార్చాలని వరికూటి అశోక్‌బాబును కోరారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకొస్తే అన్ని వేళల అందుబాటులో ఉండి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని సూచించారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు టీవీ భాస్కర్‌రెడ్డి, దొద్దాలి మల్లికార్జున, మొల్లల శివరామిరెడ్డి, చెరుకూరి శ్రీనివాసరావు, రావూరి వెంకటేశ్వర్లు, ఎం. సుబ్బారావు, కె. రామయ్య, గుంటూరి వెంకట్రావు, పి. సంజీవరెడ్డి, సర్పంచ్ కె. జ్యోతమ్మ, ఎంపీటీసీ మరియమ్మ, ఏ. వెంకటరెడ్డి, వి. మల్లికార్జున రెడ్డి, ముప్పవరపు శివన్నారాయణ, ముప్పవరపు కేశవ, ఎన్. రాఘవరావు, బి. శ్రీనివాసరావు, వాకా బాలకృష్ణారెడ్డి మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ యంత్రసేవ రైతులకు వరం



యంత్రాలు పంపిణీచేస్తున్న నేతలు

పామూరు: వైఎస్సార్ యంత్రసేవా పథకం అన్నదాతలకు వరం లాంటిదని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత అన్నారు. పామూరుతో పాటు మండలంలోని బొట్లగూడూరు, మోపాడు, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో శనివారం వ్యవసాయాధికారి కంచం రాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతులకు వైఎస్సార్ యంత్రసేవాపథకం కింద మంజూరైన మొత్తం 4 యూనిట్లకు సంబంధించి రూ.45 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలు ట్రాక్టర్లు, రోటోవేటర్, ట్రాలీ, నాగళ్లు, గొర్రులు, ఎరువుల స్ప్రే మిషన్ తదితర యంత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు రాయితీపై రైతులకు పరికరాలు అందించి వ్యవసాయాన్ని పండుగ చేసి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ ఏసురత్నం, కోఆప్షన్ నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, కందుల శ్రీనివాసరెడ్డి, చల్లా సుబ్బారావు, ఫీల్డ్ ఆఫీసర్ దివ్య, ఖాదర్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఓగూరి ఏడుకొండలు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, నాయబ్, శ్రీరాం శ్రీను, వీఏఏలు సంతోష్, బాలక్రిష్ణ, శ్రీనాథ్, హరిక్రిష్ణ, సత్యరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పనుల పరిశీలన

లింగసముద్రం: మండలంలోని మాలకొండ్రాయుని పాలెం పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరంలో ఎంపీయూపీ పాఠశాల పరిధిలో నాడు–నేడు నిధులతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ శేషబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్‌తో కలిసి శనివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రూ.16 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం పనులు సాగుతున్నాయని, త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించి సక్రమంగా నిర్మించేలా చూడాలని ఏఈకి సూచించారు. గతంలో అరకొర వసతులతో ప్రైవేట్ భవనాల్లో ఉండాల్సి వచ్చిందని, ప్రస్తుతం సొంత భవనం నిర్మిస్తుండటంతో ఇబ్బందులు తొలగాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లోక్ అదాలత్‌లో 518 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జీ భరత్‌చంద్ర

కనిగిరి రూరల్: కనిగిరి కోర్టు ఆరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 518 కేసులు పరిష్కరమైనట్లు కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 55, సివిల్ కేసులు 4, భరణం కేసులు 3, ఎస్‌టీసీ కేసులు 436లో ఇరు వర్గాల వారిని రాజీ కుదర్చి పరిష్కారం చేసినట్లు జడ్జి తెలిపారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి భరత్ చంద్ర మాట్లాడుతూ కక్షలు, కార్పణ్యాలకు పోకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు మాట్లాడుతూ చిన్న చిన్న పొరపాట్లు, క్షణికావేశం కారణంగా మనస్పర్థలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కేసుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతారని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్ రామరాజు, సీఐ రామకృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య, న్యాయవాదులు ఎస్‌కే అబ్దుల్ గఫార్, ప్రేమ లీలావతి, విద్యా, ఎస్సైలు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

కందుకూరు: కందుకూరు కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1923 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ విజయబాబు తెలిపారు. వీటిలో 1800 పెట్టీ కేసులు, 63 క్రిమినల్ కేసులు, 3 వివాహ సంబంధ కేసులు, 7 సివిల్ కేసులు, 43 అడ్మిషన్లు, 6 పిటిషన్ కేసులు, ఒక చెక్‌బౌన్స్ కేసు ఉన్నట్లు తెలిపారు. ప్రజలు లోక్ అదాలత్ ద్వారా కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీమార్గం ద్వారా కోర్టుల చుట్టూ తిరిగే ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి రాధిక, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా న్యాయమూర్తి దేశంశెట్టి రమేష్, లోక్ అదాలత్ మెంబర్లుగా బీవీ శేషయ్య, బి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే షంషుద్దీన్, సీహెచ్ మురళీధర్ వ్యవహరించారు. అలాగే వై సాంబశివరావు, హరికోటేశ్వరరావు, వి శ్రీధర్‌నాయుడు, సీహెచ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు స్థల పరిశీలన

కనిగిరి రూరల్: పట్టణంలోని ఇందిరాకాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా వార్డులో ఉన్న విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ పవన్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు అరుణోధర్ తదితరులున్నారు.

గంగా భవానీ ఆలయానికి తిరునాళ్ల శోభ

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద ఉన్న గంగాభవానీ ఆలయం తిరునాళ్లకు ముస్తాబైంది. మొదటిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో పనులను జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు శనివారం సాయంత్రం పర్యవేక్షించారు. తిరునాళ్లకు పామూరు మండలంతో పాటు నెల్లూరు జిల్లా వరికుంటపాడు, కొండాపురం, వలేటివారిపాలెం, పీసీపల్లి మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధి మహ్మదాపురం పంచాయతీ పరిధిలో రాజుగారిపల్లి దళితవాడలో శనివారం సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామి కళ్యాణం జరిపించారు. గ్రామోత్సవం, మోహినీ ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ సర్పంచ్ భర్త పల్లపోలు శ్రీనివాసులరెడ్డి, కొండారెడ్డి, రమణారెడ్డి, గొట్టిముక్కల చిరంజీవి, పెద్ద కాశయ్య, నరహరి, చిన్న కాశయ్య పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి




మాట్లాడుతున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్

వెలిగండ్ల: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పీవీ సాయికుమార్ అన్నారు. మండలంలోని రామలింగాపురంలో పర్యావరణ జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనంరోజువారి జీవనంలో చేసే చిన్న చిన్న మార్పులు పర్యావరణానికి ఉపయోగపడతాయన్నారు. పర్యావరణానికి సంబంధించి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు నవీన్, జాలిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై మహిళ ఫిర్యాదు

కొండపి: ఇంటి దగ్గర పడుకుని ఉన్న తనను ఇంటి పక్కన ఉన్న వ్యక్తి కాలుపట్టుకుని లాగాడని మహిళ కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన శనివారం జరిగింది. కొండపి ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని జాళ్లపాలెంలో ఓ గృహం వద్ద పడుకుని ఉన్న మహిళను ఇంటి పక్కన ఉన్న బండి బ్రహ్మయ్య శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో కాలు పట్టుకుని లాడారు. ఉలిక్కిపడిన మహిళ కేకలు వేయడంతో బ్రహ్మయ్య పారిపోయాడు. బాధితురాలు కొండపి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

రేషన్ పంపిణీ వాహనం తనిఖీ



రేషన్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీటీ చెంచురామయ్య

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డి పాలెంలో రేషన్ పంపిణీ వాహనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్య శనివారం తనిఖీ చేశారు. అలాగే రేషన్ సరుకుల పంపిణీపై కార్డు దారులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీటీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం వాహనం ద్వారా ఇంటింటికీ అందించే రేషన్ సరుకులను కార్డుదారులు తప్పకుండా ప్రతి నెల తీసుకోవాలన్నారు. బియ్యానికి నగదు వసూలు చేయకుండా ఉచితంగా అందించాలని, ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టి 90 శాతంకి పైగా కార్డుదారులకు రేషన్ సరుకులు అందే విధంగా చూడాలన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్లో భాగంగా శనివారం లింగంగుంట్లలో నిర్వహించిన వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ సందీప్ వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఎస్ఎం, ఎంఎల్ హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



మొగళ్లూరులో విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

వెలిగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలతో ఈ ఏడాది పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అగ్రస్థానంలో నిలబడ్డారని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సంచాలకుడు కె. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని మొగళ్లూరు జెడ్పీహైస్కూల్‌ను రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మొగళ్లూరు హైస్కూల్‌కి చెందిన ఆవుల ప్రహ్లాద, నేరెళ్ల హరికృష్ణలు 586 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన సందర్భంగా విద్యార్థులను రవీంద్రనాథ్‌రెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. అనంతరం విద్యాకానుక కిట్లు భద్రపరచిన గోదాములను పరిశీలించారు. పంపిణీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బూట్లు, బ్యాగులు, బెల్టులు, నోట్ పుస్తకాలు వంటి సామగ్రిని వేర్వేరు గదుల్లో సైజుల వారీగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎంఈఓ దాసుప్రసాద్, హెచ్ఎం రాజాల కొండారెడ్డి, కనిగిరి ఎంఈఓ జె. ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు ఖాదర్‌మొహిద్దీన్, పార్వతమ్మ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని అభినందిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ నాయకులు

కనిగిరి రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్టేట్ రెండో ర్యాంక్ (596 మార్కులు) సాధించిన విద్యార్థిని గర్రె భవ్యాంజనిని సాయిబాబా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ పులి శాంతి గోవర్ధన్, మాజీ సర్పంచ్ దేవకి లలిత కుమారిలు విద్యార్థిని సన్మానించి మాట్లాడారు. చదువులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి స్వగ్రామానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఎంఈఓ జె.ప్రసాద్‌రావు, కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank | ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు, డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత: (1). M/s మహేంద్ర బ్రిక్ ఇండస్ట్రీస్, ప్రొప్రయిటర్: శ్రీ బివి మహేంద్ర బాబు, తండ్రి: కృష్ణయ్య మరియు హామీదారు: శ్రీ చీకెళ్ల పూర్ణ వెంకట తిరుపతి రావు, తండ్రి: వెంకట సుబ్బారావు వారిని నోటీసులో ... రూ. 44,71,899.42/- (...) మొత్తంను నోటీస్ అందిన తేదీ నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది 04.01.2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత(లు) సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని 10.05.2023 తేదీన స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీతలు మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

యావన్మంది ప్రజానీకమును మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు)ను హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్ వారికి చెల్లించవలసిన బకాయి రూ. 44,71,899.42/- (...) + వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమునకు లోబడిఉంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

(i) ప్రకాశం జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ జిల్లా, కందుకూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, కందుకూరు రెవెన్యూ మండలం, అనంతసాగరం గ్రామ పంచాయితీ, అనంతసాగరం గ్రామం పరిధి, సర్వే నెం.123/1 నందు ఎ. 0.66 సెంట్లు ఖాళీ స్థలం అన్ని ... సహా యావత్తు. ...

(ii) ప్రకాశం జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ జిల్లా, కందుకూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, కందుకూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, కందుకూరు పరిధి, సర్వేనెం.167/1, ప్లాట్ నెం. 46 నందు 200 చ॥గ॥ లేదా 168 చ॥మీ॥ ఖాళీ స్థలం ... సహా యావత్తు. ... ఉత్తరం: బజారు – 60 అ॥.

తేది: 10.05.2023, ప్రదేశం: సింగరాయకొండ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank | ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు, డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ... ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు ... రూ. 44,78,688.67/- ... తేది 04.01.2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. ... 10.05.2023 తేదీన స్వాధీనపరచుకున్నారని ... రూ. 44,78,688.67/- ... + వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమునకు లోబడిఉంటాయి. ...

స్థిరాస్తి వివరములు: ...

తేది: 10.05.2023, ప్రదేశం: సింగరాయకొండ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్